శ్రీ కళింకోట ప్రభాకరదేవ్

# అభిజాత్యం

వారంరోజులనుండి 'పాప' కనిపించకపోయేసరికి డాక్టర్ శైలజకు తానేదో కోల్పోతున్నట్లుగా బాధ కలిగింది.

రకరకాల రోగులమధ్య అలసిపోయి యింటికి వచ్చే శైలజకు 'పాప' చిరునవ్వు గొప్ప రిలీఫ్. 'పాప', శైలజ చిన్ననాటి స్నేహితురాలైన లలిత కూతురు. ఆరు సంవత్సరాలుంటాయి. తెల్లగా, బొద్దుగా ముద్దు వచ్చేలాగ వుంటుంది.

'పాప' అంటే శైలజకు ప్రాణం. శైలజ యింట్లో వున్నంతసేపూ యించు మించుగా ఆమెతోనే వుంటుంటుంది పాప శైలజ దగ్గర పాప బాగా చేరిక అయింది. రాత్రిపూట కూడా వొక్కొక్కసారి తల్లి దగ్గరకు వెళ్ళకుండా శైలజ దగ్గిరే వుంటానని మారాంచేసి వుండిపోతుంటుంది. అటువంటి 'పాప' వారం రోజుల నుండి తన యింటి ఛాయలకైనా రాకపోయేసరికి శైలజ మనసు పరిపరివిధాల పోయింది. ఒకసారి స్నేహితురాలి యింటికి వెళ్ళి 'పాప' రాకపోవడానికి గల కారణం ఏమిటో తెలుసుకోవాలనిపించింది. కాని, పనుల వొత్తిడి వలన వెళ్ళడానికి వీలు చిక్కింది కాదు.

ఆ దినం ఆదివారం.

'పాప' కనిపించి అప్పటికి పది రోజులు అయింది. ఆ దినం లలిత ఇంటికి ఎలాగైనా వెళ్ళి 'పాప'ను చూసిరావాలని నిశ్చయించుకుంది.

పది గంటలకల్లా గృహకృత్యాలను ముగించి లలిత యింటికి బయలుదేరింది.

అయితే, అప్పటికే సమయం మించిపోయింది.

శైలజ వెళ్ళేసరికి లలిత యింటి గుమ్మం ముందు 'పాప' నిర్జీవంగా వుంది.

ఇరుగు పొరుగు గుమిగూడి వున్నారు.

లలిత గుండె బాదుకొంటూ ఏడుస్తోంది.

శైలజ నిలువునా వణికిపోయింది. గుండె లోతుల్నుండి దుఃఖం ఎగదన్నుకు వచ్చింది.

అక్కడ గుమిగూడివున్న యిరుగు పొరుగువాళ్ళు 'పాప' చిన్నారి చేష్టల్ని గురించి చెప్పుకుంటూ, కంటతడితో విలవిల్లాడిపోతున్నారు.

వికలమైన మనసుతో శైలజ వెనుతిరిగింది.

*            *            *

మర్నాడు, లలితను పరామర్శించడానికని వెళ్ళింది శైలజ.

శైలజను చూడగానే లలిత బావురుమంది.

దుఃఖం కన్నీరై ప్రవహించిన తరువాత —

"పాప యింత హఠాత్తుగా ... చనిపోవడానికి కారణం ఏమిటి ? ఏమన్నా జబ్బా ? ?" అని బరువెక్కిన హృదయంతో, బొంగురుపోతున్న కంఠంతో శైలజ అడిగింది.

తలూపింది లలిత.

"టైఫాయిడ్..." అంది.

"మరి ... ఆ సంగతి నాకు చెప్పలేదేం ? కబురు పెట్టవచ్చుగా." నిష్ఠూరం ధ్వనించింది స్వరంలో.

శైలజ అడిగినదానికి జవాబుగా లలిత తల వాలిపోయింది. మనసులో బడబాగ్ని చెలరేగింది.

"నేనంత పరాయిదాన్నయిపోయానా ?" లలిత మౌనానికి మరింత బాధ చెందుతూ ప్రశ్నించింది శైలజ. ఆ ప్రశ్నకు తలెత్తి తడిదేరిన కళ్ళతో చూసింది లలిత.

"లేదు శైలూ ! నువ్వు ... నువ్వు ... పాపకు పరాయిదానివి ఎలాగ అవుతావు ? నేను కన్నానేగాని.. పాప నీదగ్గరే పెరిగింది..." అంది.

"మరి ... కబురెందుకు చెయ్యలేదు ?" ప్రశ్నను పునరావృతం గావించింది—జవాబుకోసం ఆరాటం చెందుతూ.

లలిత కొద్ది క్షణాలు మౌనం వహించింది.

ఆ తరువాత నెమ్మదిగా ... సంకోచపు తెరలను తొలగించుకుంటూ ...

"ఆ రోజు నువ్వు ... పాప గొలుసును విడిపించమని రెండు వందలు యిచ్చావు. గుర్తుందా ?" మెల్లగా ప్రశ్నించింది.

శైలజ తలూపింది. గతం గుర్తుకు వచ్చింది.

పదిరోజుల క్రితం, పాప మెడబోసిగా వుండడం చూసి—

"పాపా ! నీ గొలుసేది?" అని ప్రశ్నించింది తను.

''అమ్మ తీసేసింది ఆంటీ!'' అంది పాప. ఆ సమయంలో లలిత అక్కడే వుంది.

''లలితా ! పాప గొలుసును ఎందుకు తీశావు ? గొలుసు లేకపోతే పాప మెడ బోసిగా వుంది'' అంది తను.

తన మాటలకు లలిత —

''డబ్బు అవసరంవలన పాప గొలుసును తాకట్టు పెట్టవల్సి వచ్చింది'' అని జవాబు చెప్పింది.

లలిత జవాబుకు తన మనసు చివుక్కుమంది.

''డబ్బు అవసరమైతే నన్ను అడగకలేకపోయావా ? పాప గొలుసు తాకట్టు పెట్టడం బాగులేదు. ఇంతకీ గొలుసు ఎంతకు తాకట్టు పెట్టావు ?''

''రెండు వందలు.''

''సరే. ఆ డబ్బు నేను యిస్తాను. తీసుకువెళ్ళి పాప గొలుసును వెంటనే విడిపించు'' అని రెండు వందలు యిచ్చింది.

గతంను గుర్తుకు తెచ్చుకుంటూ, లలిత ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది శైలజ.

ఆమె మనసులో రకరకాల ఆలోచనలు ... అనుమానాలు చెలరేగాయి.

''రెండు వందలకీ...నువ్వు నాకు కబురు చెయ్యకపోవడానికి సంబంధం ఏమిటి లలితా ?'' అడిగింది శైలజ.

లలిత దోషిలాగ తలవాల్చుకుంది.

''ఉంది శైలూ ! ఆ రోజు నువ్విచ్చిన రెండు వందలతో పాప గొలుసు విడిపించలేకపోయాను. చుట్టాలు రావడంతో ఆ డబ్బు ఖర్చయిపోయింది. ఇంతలో, పాపకు టైఫాయిడ్. నీకు కబురు చేద్దామంటే...పాప గొలుసును విడిపించావా అని అడుగుతావని ... భయంతో ... సిగ్గుతో ... వూరుకున్నాను.'' అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది లలిత.

శైలజ భారంగా నిట్టూర్చింది.

---


# WANTED

## Technical Examinations Training College

*Managed by Indian Technical Educational Society*

[Recognised by Com.University]

1. ACCOUNTANCY
2. BANKING
3. MANAGEMENT
4. D. COM.

University మరియు ప్రభుత్వము వారిచే నిర్వహించు పై కోర్సులకు మా కళాశాలలో శిక్షణ పొందవలెను. తరువాత Bank లందు ప్రభుత్వ కార్యాలయములందు, ఇతర సంస్థలందు Accountants, Clerks, Cashiers, Managersగా చేరి నెలకు రు. 460-850 వరకు జీతము పొందుటకు అర్హులు.

విద్యార్హత : S. S. C. or Intermediate or Degree Passed/Failed.

శిక్షణ కాలము : 2 నుండి 6 నెలలు.

Age : 17 years and above.

Scholarship : Rs. 150. శిక్షణాకాలమందు ఉచిత Hostel వసతి లభించును. Mess facilities కలదు. శిక్షణ పొందగోరు అభ్యర్థులు Prospectus మరియు Application Form కొరకు రు. 3/– M. O. or Postal Order పంపి పొందవచ్చును.

గమనిక : అన్ని కోర్సులకు పోస్టలు మూలముగాకూడా శిక్షణ కలదు.

*Principal,* **T. E. T. COLLEGE,** Koyambedu, Madras-602102.